పేరుకే చలివేంద్రాలు

- నగర పరిధిలో తూతూమంత్రంగా ఏర్పాటు
- తాగునీటికి గతి లేదు
- కాంట్రాక్టర్‌కు కాసుల వర్షం
- ప్రజాధనం వృథా

నెల్లూరు(బారకాసు): ఎస్‌ఎంసీ అధికారులు ప్రజాధనం వృథా చేస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వేసవి సందర్భంగా నగరపాలక సంస్థ పరిధిలో దాదాపు 25కు పైగా చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే వాటి వల్ల ప్రజలకు ఉపయోగం లేకుండా పోయింది. కొన్నింట్లో కుండల్ని నింపేందుకు వాటర్ ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేశారు. మరికొన్నిచోట్ల కూలింగ్ వాటర్ క్యాన్లు ఏర్పాటు చేశారు. వీటిలో సిబ్బందిని నియమించారు. వారికి ఎంత వేతనాలు ఇస్తున్నారన్నది బయటపెట్టలేదు.

ఏదో అలా..

చలివేంద్రాలను కొద్దిరోజులపాటు సక్రమంగా నిర్వహించినా ఆ తర్వాత గాలికొదిలేశారు. మొదట్లో ఏర్పాటు చేసిన చలివేంద్రాల్లో మజ్జిగ ఇచ్చారా అంటే అదీ లేదు. రూ.200 కోట్ల బడ్జెట్ గల ఎస్‌ఎంసీ అధికారులు, పాలకవర్గం మండు వేసవిలో ప్రజలకు మజ్జిగ ఇచ్చిన పాపాన పోలేదు. నగరంలో ఇప్పటికే పలు స్వచ్ఛంద సంస్థలు, క్లబ్‌లు, ఇతర సంఘాలు మజ్జిగ చలివేంద్రాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. కార్పొరేషన్ అధికారులు నగరంలోని అధికంగా జనసంచారం ఉండే ట్రంక్ రోడ్డు, ఆత్మకూరు బస్టాండ్, రంగనాయకులపేట గేట్ సమీపంలో, నవాబుపేట సెంటర్, వీఆర్సీ, ఆర్టీసీ బస్టాండ్ సెంటర్, బాలాజీనగర్, పద్మావతి సెంటర్, మినీబైపాస్ రోడ్డు తదితర ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. వాటిలో కేవలం తాగునీరు మాత్రమే బాటసారులకు పంపిణీ చేశారు. అయితే వాటిని ఎండలు తగ్గేంత వరకు నిర్వహించాల్సి ఉండగా వేసవికాలం ముగియకుండానే వాటి నిర్వహణను పట్టించుకోలేదు.

నిర్వహణకు రూ.40 లక్షలు

చలివేంద్రాలు ఏర్పాటు బాధ్యతలను ఓ కాంట్రాక్టర్‌కు అప్పగించారు. వీటి నిర్వహణ కోసం రూ.40 లక్షలు వెచ్చించినట్లు సమాచారం. పట్టుమని మూడు నెలలు కూడా నిర్వహించకుండానే మధ్యలోనే వదిలేశారు.

పలుచోట్ల అవి ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఎవరైనా దాహార్తి తీర్చుకోవడానికి వెళ్తే తాగునీరు లేకపోవడంతో ఉసూరుమంటూ వెనుదిరగాల్సిన పరిస్థితి. ఇప్పటికీ ఎండలు మండుతూనే ఉన్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో చలివేంద్రాలను మధ్యలోనే నిలిపివేస్తే ప్రజలు దాహార్తి తీర్చుకునేందుకు అనేక అవస్థలు పడాల్సి వస్తోంది. సంబంధిత అధికారులు చలివేంద్రాలను కొనసాగిస్తే బాగుంటుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.



గాంధీబొమ్మ సెంటర్‌లో నిరుపయోగంగా..



శెట్టిగుంటరోడ్డుకు వెళ్లే మార్గం మొదట్లో ఏర్పాటు చేసిన చలివేంద్రం

రేపట్నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు



ఆహ్వానపత్రికలను ప్రదర్శిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): వేదాయపాళెంలోని శ్రీస్వామి అయ్యప్ప దేవస్థానం ప్రాంగణంలోని మహాలక్ష్మి గోదా సమేత గురువాయూర్ మహావిష్ణు ఆలయంలో ఈనెల 17 నుంచి 22వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగుతాయని శ్రీస్వామి అయ్యప్ప సేవా సమాజం అధ్యక్షుడు గూడల శేషగిరిరావు తెలిపారు. దేవస్థాన ప్రాంగణంలో ఆదివారం ఆహ్వానపత్రికలను సమాజం కార్యదర్శి కత్తుల వెంకటరత్నం, ఉపాధ్యక్షుడు పీటీ జగన్నాథం, బిరుదవోలు శ్రీకాంత్‌రెడ్డి, కత్తి మోహన్‌రావు, కేజీ శంకరన్, రమణయ్య, నాగేశ్వరరావులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శేషగిరిరావు మాట్లాడుతూ స్వామివారికి ఐదురోజులు విశేషంగా నిర్వహించే వార్షిక బ్రహ్మోత్సవాల్లో భక్తులు పాల్గొనాలని కోరారు.

క్లుప్తంగా

ఘన సన్మానం



నెల్లూరు(టౌన్): ఫాదర్స్ డేను పురస్కరించుకుని ఆదివారం వెంకటేశ్వర విద్యాలయంలో కార్టునిస్ట్ మోపూరు రామ్‌శేషు కుమార్తె పావని స్మారక పురస్కారంలో భాగంగా చదువు, క్రీడలు, శాస్త్రీయ సంగీతం, ఆల్‌రౌండర్, శాస్త్రీయ నృత్య విభాగాల్లో ప్రతిభ చూపిన ఐదుగురిని ఘనంగా సత్కరించారు. నాట్యంలో దీక్షిత, సంగీతంలో ఝాన్సీ, విద్యలో జీవన, ఆల్‌రౌండర్‌లో జ్యోత్స్న, క్రీడల్లో హమీషాలను శాలువాతో సత్కరించి నగదు, జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో రామశేషు, ప్రశాంతి, సుభద్రాదేవి, పెంచలలక్ష్మి, పెంచల నరసింహం, శ్రీనివాసులు, భావన పాల్గొన్నారు.

ఆశ్రమంలో ఫాదర్స్ డే



సాంబశివరావును సన్మానిస్తున్న దృశ్యం

నెల్లూరు(బృందావనం): కొండాయపాళెంరోడ్డు వనంతోపు సెంటర్‌లోని జనహిత – వాత్సల్య నిరాదరణ బాలల, వృద్ధుల ఆశ్రమంలో ఆదివారం ఫాదర్స్ డేను నిర్వహించారు. మానవ సేవయే మాధవ సేవ టీం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఆశ్రమ కార్యనిర్వాహక కార్యదర్శి జీవీ సాంబశివరావును ఘనంగా ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు, ఉద్యోగ సంఘ నేత చేజర్ల సుధాకర్‌రావు మాట్లాడుతూ సాంబశివరావు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఆశ్రమ కమిటీ సభ్యులు చెన్నూరు వెంకటేశ్వరరెడ్డి, మానవసేవయే మాధవ సేవ టీం నిర్వాహకులు అరవ పరిమళ,రఘునాథరాజు, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

శ్రీశ్రీకి ఘన నివాళి



నెల్లూరు(వీఆర్సీసెంటర్): మహాకవి శ్రీశ్రీకి ప్రజా నాట్యమండలి, డప్పు కళాకారుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘన నివాళులర్పించారు. నగరంలోని 17వ డివిజన్‌లోని జక్కా వెంకయ్య భవన్‌లో శ్రీశ్రీ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. ప్రజా నాట్యమండలి సీనియర్ నాయకుడు పి.విజయ్‌కుమార్ మాట్లాడుతూ యువత శ్రీశ్రీ రచనలు చదివి నవ సమాజ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గండవరపు శేషయ్య, శ్రీనివాసులు, కృష్ణయ్య, వేణు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ హైస్కూల్‌కు పూర్వ వైభవం

నెల్లూరు(టౌన్): వీఆర్ హైస్కూల్‌కు పూర్వ వైభవం రానుందని మంత్రి నారాయణ తెలిపారు. ఆదివారం ఆ హైస్కూల్లో నారాయణ దంపతులు అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూల్లో నర్సరీ నుంచి 9వ తరగతి వరకు తరగతులు ప్రారంభించనున్నట్లు చెప్పారు. విద్యార్థులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, సాయంత్రం స్నాక్స్ పెడతారన్నారు. డిజిటల్ విద్యను అందిస్తామన్నారు. అన్ని రకాల క్రీడా పరికరాలతో మైదానాన్ని సిద్ధం చేశామన్నారు. ఈ విద్యా సంవత్సరంలో వెయ్యి మందికిపైగా విద్యార్థులకు అడ్మిషన్స్ కల్పిస్తున్నామన్నారు. నెల్లూరు నగరంలోని 54 మున్సిపల్ పాఠశాలలను దాతల సహకారంతో వీఆర్ హైస్కూల్ తరహాలో తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, కమిషనర్ నందన్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

ఐదు ఎకరాల్లో స్పోర్ట్స్ కాంప్లెక్స్

నెల్లూరు సిటీ: ఐదు ఎకరాల్లో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను త్వరలోనే ఏర్పాటు చేస్తామని మంత్రి నారాయణ తెలిపారు. నగరంలోని నవాబుపేట, వెంకటేశ్వరపురంలో ఆధునికీకరించిన ఎఫ్‌సీఐ, అబ్దుల్ కలాం పార్కులను ఆదివారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1,400 కుటుంబాలకు త్వరలోనే సీఎం చేతుల మీదుగా పట్టాలను పంపిణీ చేస్తామన్నారు. నిరుపేదలు ఉండే ప్రాంతాల్లో అన్ని హంగులతో పార్కులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. పాలిటెక్నిక్ కాలేజీ గ్రౌండ్‌ను స్పోర్ట్స్‌కు అనుగుణంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, కో–ఆప్షన్ మెంబర్ జమీర్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్ల తీరు మారాలి

ముత్తుకూరు(పొదలకూరు): ఆర్టీసీ బస్టాండ్ల తీరు మారాలని, సౌకర్యాలను మెరుగుపరచకుంటే చర్యలు తీసుకుంటామని ఆర్టీసీ రీజనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక బీజేపీ నాయకులతో కలిసి సురేష్‌రెడ్డి ఆదివారం ముత్తుకూరు బస్టాండ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇక్కడ కనీస వసతులు కూడా లేవన్నారు. అత్యధికంగా బస్సులు తిరిగే మార్గమే కాక ముత్తుకూరు నుంచి ఆర్టీసీకి ఆదాయం కూడా వస్తున్నట్టు తెలిపారు.

వైభవంగా కల్యాణ మహోత్సవం



నెల్లూరు(బృందావనం): శ్రవణ నక్షత్రం సందర్భంగా బాలాజీనగర్‌లోని సీతారామస్వామి వారి మందిరంలో ఆదివారం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి వారికి కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. తొలుత స్వామికి పూజలు, పంచామృతాభిషేకాలను నిర్వహించారు. ఉభయకర్తలుగా ఘంటసాల రేవతికుమార్ – ఉషారాణి దంపతులు వ్యవహరించారు. కార్యక్రమాలను మందిర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు తన్నీరు మస్తాన్‌రావు, సోమిశెట్టి వెంకటరత్నం, కోశాధికారి కె.శివప్రసాద్ పర్యవేక్షించారు.

యోగాపై అవగాహన కల్పిస్తూ..

- బైక్ ర్యాలీ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జరుగుతున్న యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆదివారం పతంజలి యోగా సమితి, యోగా మిత్రమండలి ఆధ్వర్యంలో నగరంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా సెట్నల్ సీఈఓ నాగేశ్వరావు, డీఎస్‌డీఓ ఎతిరాజు విచ్చేసి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం నుంచి గాంధీబొమ్మ వరకు సాగింది. కార్యక్రమంలో నజీర్‌బాషా, చంద్రశేఖర్, విజయ్‌కుమార్‌రెడ్డి, ముత్యాల రవీంద్ర, పెంచలయ్య, రమణయ్య, కోటేశ్వర్‌రెడ్డి, అనిల్, పద్మ, నీరజ తదితరులు పాల్గొన్నారు.



బైక్ ర్యాలీని ప్రారంభిస్తూ..

గిరిజన కుటుంబాలకు ఉచిత వైద్యసేవలు

నెల్లూరు(అర్బన్): గిరిజన కుటుంబాలకు జయభారత్ ఆస్పత్రిలో 10 పడకల వార్డును ఏర్పాటు చేసి ఉచిత వైద్యసేవలందించడం అభినందనీయమని నగర మేయర్ పొట్లూరు స్రవంతి అన్నారు. సింహపురి సేవా సమితి ఆధ్వర్యంలో నడుస్తున్న నగరంలోని జయభారత్ ఆస్పత్రిలో ఆదివారం గిరిజనులకు ఆరోగ్య గుర్తింపుకార్డులను ఇచ్చే కార్యక్రమాన్ని మేయర్ ప్రారంభించి మాట్లాడారు. కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో గిరిజనులకు ఆరోగ్య కార్డులు ఇవ్వడమే కాకుండా ఈనెల 30వ తేదీ వరకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తుండటంపై హర్షం వ్యక్తం చేశారు. గిరిజనులకు సేవ చేయడం గొప్ప విషయమన్నారు. ఆస్పత్రి జనరల్ మేనేజర్ గురుప్రసాద్ మాట్లాడుతూ గిరిజన కాలనీల్లో ప్రతి కుటుంబానికి ఆరోగ్య గుర్తింపు కార్డులను ఇవ్వనున్నామన్నారు. అలాగే ఆధార్ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో గిరిజన మోర్చా రాష్ట్ర నాయకులు శ్రీనివాసులు, ఆడిటింగ్ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, సుధాకర్‌రావు, మోహన్‌రావు, మురళి తదితరులు పాల్గొన్నారు.



గుర్తింపుకార్డును అందజేస్తున్న మేయర్ స్రవంతి

ఆటో స్టాండ్ ప్రారంభం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని మూలాపేట గేట్ సెంటర్‌లో ఆదివారం సీఐటీయూ ఆధ్వర్యంలో నూతన ఆటో స్టాండ్‌ను ఏర్పాటు చేశారు. సీఐటీయూ రూరల్ కార్యదర్శి పెంచల నరసయ్య, ఆటో కార్మిక సంఘం రూరల్ కార్యదర్శి సుధాకర్‌ల చేతుల మీదుగా దీనిని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటో కార్మికులు యూనియన్ నిబంధనలు పాటిస్తూ క్రమశిక్షణతో ఉండాలన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ పనిచేస్తుందన్నారు. వచ్చే నెల 1వ తేదీన బుచ్చిలో ఆటో కార్మిక సంఘం జిల్లా మహాసభలు జరుగుతాయన్నారు. ఈనెల 27వ తేదీన రూరల్ 4వ మహాసభల్ని ఎంవీఎస్ కల్యాణ మండపంలో నిర్వహిస్తామన్నారు. సంఘం నూతన కమిటీ గౌరవాధ్యక్షుడిగా అమీర్‌బాషా, అధ్యక్షుడిగా ప్రసాద్, కార్యదర్శిగా సునీల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బాబు, జయప్రకాష్, శ్రీనివాసులు, రాజా, షంషాద్, షబ్బీర్, తదితరులు పాల్గొన్నారు.



క్రికెట్ పోటీల్లో జేశాప్ నెల్లూరు జట్టు విజయం



విజేత జట్టును అభినందిస్తున్న డీఎస్‌డీఓ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఆదివారం నెల్లూరు రూరల్ సబ్ డివిజన్ పోలీస్ క్రికెట్ జట్టు, జేశాప్ నెల్లూరు జట్ల మధ్య క్రికెట్ జరిగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న పోలీస్ జట్టు 12.1 ఓవర్‌లో 68 పరుగులకు ఆలౌటైంది. కొడవలూరు సీఐ సురేంద్రబాబు 36 పరుగులు సాధించారు. తదుపరి బ్యాటింగ్ చేసిన జేశాప్ నెల్లూరు జట్టు కేవలం 7.4 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 71 పరుగులు చేసి విజేతగా నిలిచింది. సాయి 39 పరుగులు చేసి జట్టు విజయానికి తోడ్పడ్డారు. అనంతరం ఇరుజట్లను జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఆర్‌కే ఎతిరాజ్ అభినందించి ప్రోత్సాహక బహుమతి అందజేశారు. కార్యక్రమంలో కొడవలూరు, బుచ్చిరెడ్డిపాళెం సీఐలు సురేంద్రబాబు, శ్రీనివాసులురెడ్డి, నెల్లూరు రూరల్ ఎస్సై ప్రసాద్ రెడ్డి, జేశాప్ నెల్లూరు సభ్యులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా విజయకుమార్‌రెడ్డి

- వేరేవారి కళ్లలో ఆనందం కోసమే ఆయనపై విమర్శలు
- సన్నపురెడ్డి పెంచలరెడ్డిపై నేతల ఫైర్

నెల్లూరు సిటీ: 'అధికార పార్టీ ఆగడాలతో నెల్లూరు రూరల్లో వైఎస్సార్‌సీపీ కార్యకర్తగా చెప్పుకొనేందుకు భయపడే పరిస్థితిలో ఆనం విజయకుమార్‌రెడ్డి అండగా ఉంటానని ధైర్యం చెప్పి పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారు' అని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చెవిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి రావు శ్రీనివాసరావు, రూరల్ మున్సిపల్ విభాగం అధ్యక్షుడు నెల్లూరు మదన్ మోహన్‌రెడ్డి, రాష్ట్ర అంగన్‌వాడీ విభాగం కార్యదర్శి రావుల వెంకటజ్యోతి తెలిపారు. చింతారెడ్డిపాళెంలోని ఆనం నివాసంలో ఆదివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కోవర్ట్ అయిన సన్నపురెడ్డి పెంచలరెడ్డి కొందరి కళ్లలో ఆనందం కోసం వైఎస్సార్‌సీపీ రూరల్ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డిపై తప్పుడు ఆరోపణలు చేశారని మండిపడ్డారు. బొబ్బల శ్రీనివాసులు యాదవ్‌కు నగర అధ్యక్ష పదవి విషయంలో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి, విజయకుమార్‌రెడ్డిలు కలిసి నిర్ణయం తీసుకున్నారన్నారు. పెంచలరెడ్డి పదవి విజయకుమార్‌రెడ్డి తొలగించారని అబద్ధపు ప్రచారం చేస్తున్నారన్నారు. ఆదాల ప్రభాకర్‌రెడ్డికి, ఆనంకు మధ్య గొడవ పెట్టేందుకు పెంచలరెడ్డి మాట్లాడారని స్పష్టంగా అర్థమవుతోందన్నారు. వైఎస్సార్‌సీపీ ఓడిపోయిన తర్వాత అధిష్టానం కమిటీలను రద్దు చేసి నూతన కమిటీలు ఏర్పాటు చేసిందన్నారు. పెంచలరెడ్డి నగరాధ్యక్ష పదవిలో ఉండగా పార్టీ బలోపేతానికి ఏదైనా కార్యక్రమానికి పూనుకున్నారా అని ప్రశ్నించారు. రూరల్ నియోజకవర్గంలో ఎంతోమందికి పదవులు కల్పించిన ఘనత విజయకుమార్‌రెడ్డికి దక్కుతుందన్నారు. 18 గ్రామాల్లో 189 పదవులు, మండల కమిటీలో 27 మందికి, రాష్ట్ర కార్యదర్శులుగా 8 మందికి, 10 మంది జిల్లా స్థాయి పదవులు వచ్చాయన్నారు. అధికార పార్టీ నేతలతో లోపాయికారి ఒప్పందాలు పెట్టుకుని వైఎస్సార్‌సీపీలో కోవర్ట్‌గా ఉంది నిజం కాదా అని సన్నపురెడ్డిని ప్రశ్నించారు. నీ వ్యాపారం కోసం తప్ప పార్టీ కోసం ఏనాడైనా కష్టపడ్డావా అన్నారు. వైఎస్సార్‌సీపీకి వేలమంది కష్టపడే వారు ఉన్నారన్నారు. శ్రీనివాసులు యాదవ్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. అధికార పార్టీ నాయకులు ఇప్పటికే తమను ఇబ్బంది పెట్టారని, బెదిరించారని చెప్పారు. ఎన్ని కష్టాలొచ్చినా నిత్యం ప్రజల్లోనే ఉంటామన్నారు. సమావేశంలో మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీసునంద, నాయకులు శ్యామ్‌సింగ్, రమాదేవి, రజని, వంశీకృష్ణ, శ్రీనివాసులు, ఆళ్ల మనోహర్‌రెడ్డి, నారాయణరెడ్డి, జాకీర్, జుబేర్, ముజాఫర్ తదితరులు పాల్గొన్నారు.

- శ్రీనివాసులు యాదవ్‌కు పదవి వచ్చిన సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ సత్కరించారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నగరాధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, చిత్రంలో నేతలు

విద్యా వలంటీర్లను నియమించాలి

నెల్లూరు(టౌన్): మున్సిపల్ పాఠశాలల్లో తక్షణమే విద్యా వలంటీర్లను నియమించాలని ఆర్టీఏ అధ్యక్షుడు ఖాజామొహిద్దీన్, కార్యదర్శి కిరణ్‌కుమార్ తెలిపారు. స్థానిక వీఆర్ హైస్కూల్లో మంత్రి నారాయణను ఆదివారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్జీటీలకు పదోన్నతులు ఇవ్వడం ద్వారా మోడల్, బేసిక్, ఫౌండేషన్ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఏర్పడిందన్నారు. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని వెంటనే విద్యా వలంటీర్లను నియమించాలన్నారు.

ఘనంగా అమరావతి కృష్ణారెడ్డి జన్మదిన వేడుకలు



కృష్ణారెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

నెల్లూరు(బృందావనం): 25 కళా సంఘాల ఆధ్వర్యంలో ఆ సంఘం అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి పుట్టినరోజు వేడుకల్ని ట్రంకురోడ్డు గాంధీబొమ్మ దగ్గర ఉన్న కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి కృష్ణారెడ్డిని ఘనంగా సన్మానించారు. కృష్ణారెడ్డి మాట్లాడుతూ నెల్లూరు జిల్లా కళాకారులకు పుట్టినిల్లన్నారు. ఎందరో కళాకారులు, నిర్మాతలు, దర్శకులు, సాంకేతిక నిపుణులుగా చలనచిత్ర, రంగస్థల, బుల్లితెర, నాటక తదితర రంగాల్లో రాణించి ప్రతిభ చాటి సింహపురి సీమకు పేరు తెచ్చారన్నారు. కళాకారుల సంక్షేమానికి కృషిచేస్తానన్నారు. ఈ సందర్భంగా పలువురు కళాకారులు, హోటల్స్ అసోసియేషన్ ప్రతినిధులు, అభిమానులు కృష్ణారెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో 25 కళా సంఘాల కన్వీనర్లు దోర్నాల హరిబాబు, షేక్ అమీర్‌జాన్, వి.భాస్కర్, కోసూరు రత్నం, వివిధ అసోసియేషన్లకు చెందిన రియాజ్, శివలంకి రవికుమార్, రెమో, బాలు, దయ, హుస్సేన్, కిర్మాని, లక్ష్మీకాంత్‌బాబు, సుధాకర్‌రెడ్డి, లక్ష్మీరెడ్డి, కామేశ్వరరావు, మోహన్‌రాజు, నారాయణబాబు, నటరాజ్, మురుగన్, గోపి, థామస్, మధు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలపై అవగాహన అవసరం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ప్రతిఒక్కరికీ రాజకీయాలపై అవగాహన ఎంతో అవసరమని మాజీ ఎమ్మెల్సీ వి.బాలసుబ్రహ్మణ్యం, ఆవాజ్ జిల్లా కార్యదర్శి రషీద్ అన్నారు. నగరంలోని ఎంవీఎస్ కల్యాణ మండపంలో ఆదివారం ఆవాజ్ జిల్లా రాజకీయ శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగం ఇచ్చిన హక్కులను రాజకీయ నాయకులు కాలరాస్తున్నారన్నారు. అందులో భాగంగానే వక్ఫ్ చట్ట సవరణ బిల్లు తీసుకురావడం జరిగిందన్నారు. ముస్లిం మైనార్టీలు ఆర్థికంగా వెనుకబడి ఉన్నారని, వారిని పట్టించుకునే స్థితిలో నేటి ప్రభుత్వాలు లేవని విమర్శించారు. ఉన్నత ఉద్యోగాల్లో నూటికి 4 శాతం మంది మాత్రమే ముస్లింలు ఉన్నారని, వీటిని గుర్తించాలంటే రాజకీయంగా అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆవాజ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రషీద్, రఫీ, నాయకులు యాజాన్, నజీర్ బాషా, మాజీ డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు, కొండా ప్రసాద్, పెంచలనరసయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రషీద్

ఘనంగా ప్రపంచ రక్తదాతల దినోత్సవం

నెల్లూరు(బృందావనం): ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా శాఖలో ఆదివారం రెడ్‌క్రాస్ చైర్మన్ వాకాటి విజయకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని నిర్వహించారు. తొలుత చైర్మన్, కోశాధికారి సురేష్‌కుమార్‌జైన్, బ్లడ్‌సెంటర్ అడ్వైజర్, మేనేజింగ్ కమిటీ సభ్యులు మలిరెడ్డి కోటారెడ్డి, దాసరి రాజేంద్రప్రసాద్, కలికి శ్రీహరిరెడ్డి, బ్లడ్‌సెంటర్ కన్వీనర్ సీహెచ్ అజయ్‌బాబు కలిసి హెన్రీ డ్యూనాంట్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. రక్తదాన ఆవశ్యకతపై రెడ్‌క్రాస్ నెల్లూరు జిల్లా శాఖ ఫౌండర్ తిక్కవరపు సుకుమార్‌రెడ్డి, మాజీ చైర్మన్ డాక్టర్ ఏవీ సుబ్రహ్మణ్యం పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. కోటారెడ్డి మాట్లాడుతూ రక్తదాతలను బ్లడ్ సెంటర్ సబ్ కమిటీ సభ్యులుగా చేర్చుకోవాలన్నారు. అత్యధిక సార్లు రక్తం ఇచ్చిన 57 మంది దాతలను గుర్తించి విజయకుమార్‌రెడ్డి, మేనేజింగ్ కమిటీ సభ్యుల ద్వారా జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేశారు. చైర్మన్ మాట్లాడుతూ 2023 – 24 సంవత్సరానికి గానూ 16,401 యూనిట్లు, 2024 – 25కు 15,743 యూనిట్ల రక్తం సేకరించినందకు రాష్ట్రస్థాయి అవార్డు రావడం సంతోషం కలిగించిందన్నారు. రాష్ట్ర స్థాయిలో అత్యధికంగా 119 పర్యాయాలు రక్తదానం చేసిన ఏకైక వ్యక్తి మదనపల్లి మధుసూదన్‌రావు, రెడ్‌క్రాస్ బ్లడ్ మోటివేటర్‌ను రాష్ట్ర మంత్రి అవార్డును అందజేసి ప్రశంసించారన్నారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ చమర్తి జనార్దనరాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మలిరెడ్డి కోటారెడ్డి

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు డ్రైవర్లకు గాయాలు

మనుబోలు: మండల పరిధిలోని జాతీయ రహదారిపై జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు డ్రైవర్లకు తీవ్ర గాయాలయ్యాయి. కొండూరుసత్రం వద్ద శనివారం అర్ధరాత్రి తర్వాత తిరుపతి నుంచి హైదరాబాద్ వెళ్తున్న ట్రావెల్స్ బస్సు కొండూరు సత్రం వద్ద అదుపుతప్పి బొలెరో వాహనాన్ని ఢీకొని ఆపై ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మనుబోలు మండలం కట్టువపల్లి గ్రామానికి చెందిన బస్సు డ్రైవర్ సునీల్, సహాయ డ్రైవర్‌తోపాటు బొలెరో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో చికిత్స నిమిత్తం నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అలాగే ఆదివారం ఉదయం విజయవాడ నుంచి చెన్నై వెళ్తున్న లారీ కృష్ణపట్నం పోర్టు వద్ద ముందు వెళ్తున్న మరో లారీని ఢీకొంది. దీంతో వెనుక లారీ డ్రైవర్‌కు గాయలయ్యాయి. ఇతన్ని కూడా 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. పోలీసులు రెండు ప్రమాదాలపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

